ఏబీవీపీ నాయకుల రాస్తారోకో

రాయికల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాయికల్ పట్టణంలో బుధవారం ఏబీవీపీ నాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి మనోజ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకుండా పెండింగ్‌లో ఉంచిన రూ.8,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కారణంగా మధ్య తరగతి విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరీష్, కార్తీక్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయికల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపూర్ 33 కేవీ విద్యుత్ లైన్‌లో చెట్ల కొమ్మల తొలగింపు దృష్ట్యా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని జగిత్యాల రూరల్ ఏడీఈ తెలిపారు. కావున మండలంలోని ఒడ్డెలింగాపూర్, ఇటిక్యాల, తాట్లవాయి గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

చెక్కుల పంపిణీ

మల్లాపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పలువురు లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. నిధుల మంజూరుకి కృషి చేసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మి, నాగరాజు, కాంతయ్యాచారి, వెంకటేష్, ధర్మరాజు, సాయిరాం, రమణ, లచ్చన్న, రామదాసు అరవింద్ పాల్గొన్నారు.

టీఆర్‌టీఎఫ్ మండల కార్యవర్గం

కథలాపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) మండల శాఖ కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తిరుక్కోవెల శరత్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా కురుమెల్లి కరుణాకర్, ఉపాధ్యక్షుడిగా చెదలు హన్మాండ్లు, దార సుమన్, గుండవేని వంశీకృష్ణ, నేరెళ్ల స్రవంతి, కార్యదర్శులుగా మూటపల్లి ప్రసాద్, రాజుల నాగరాణి, మోతె సారిక, సతీష్‌కుమార్, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా ఆడేపు రాము, అదనపు కార్యదర్శి వంగ పర్శరాము, జిల్లా కౌన్సిలర్లుగా గంగాధర్, సుంకరవర రాజేశ్, మేదిని దేవయ్య, గుండ శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా తాడూరి సతీష్‌గౌడ్, పరిశీలకుడిగా గంగుల రణధీర్ వ్యవహరించారు.

రైతులపై అదనపు ఆర్థికభారం



- వరి కోత యంత్రాలకు పెరిగిన డిమాండ్
- మొంథా తుఫాను దెబ్బకు నేలవాలిన పంటలు
- ఆందోళనలో అన్నదాతలు

జగిత్యాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంటలు చేతికి వచ్చే సమయంలో మొంథా తుఫానుతో కురిసిన భారీ వర్షాలకు వరి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వరి చేలు పూర్తిగా నేల వాలాయి. దీంతో పంటలు కోయడం భారంగా మారింది. ఇప్పటికే తెగుళ్లు, వర్షాలతో పెట్టుబడి పెరిగింది. వరుణుడి దెబ్బతో రైతులపై మరింత భారం పడింది. పంటలు కోయాల్సిన సమయంలో పలు ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో వరి పొలాలు నీట మునిగాయి. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సుమారు 3.15లక్షల ఎకరాల్లో వరి సాగయింది. జిల్లాలో సుమారు 7.50 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 8 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు.


నేల వాలిన పంటలు..

వర్షాకాలం ప్రారంభంలో కురిసిన చినుకులు రైతులకు ఆశ కలిగించాయి. ఆగస్టు, సెప్టెంబరులో కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు నిండడంతో పంటలు పుష్టిగా పండాయి. అయితే అక్టోబరులో కురిసిన వర్షాలు పంటలను దెబ్బతీశాయి. పెసర, మినుము, సోయా, చిక్కుడు, పత్తి, మొక్కజొన్న పంటలతో పాటు వరి పొలాలు నీట మునిగాయి. పంటలు చేతి కొచ్చిన సమయంలో వర్షాలు పడడంతో నష్టపోయారు. ఇప్పుడు వరి పంటలు కోయడం మరింత భారంగా మారింది.

యంత్రాలే ఆధారం..

వర్షాలతో పొలాల్లో నీరు నిలిచిపోవడంతో కూలీలతో పనులు కష్టంగా మారింది. మహిళా కూలీల కొరత, కూలి రేట్లు పెరగడం రైతులకు భారమైంది. ఒక్కో మహిళా రైతుకు రోజు కూలి రూ.600 నుంచి రూ.800 వరకు చెల్లిస్తున్నారు. అయినా కూలీలు దొరకడం లేదు. దీంతో రైతులు హార్వేస్టర్లను ఆశ్రయిస్తున్నారు. వర్షాలతో పొలాల్లో బురద ఉండడంతో సాధారణ యంత్రాలతో పంటలు కోసే పరిస్థితి లేదు. దీంతో చైన్ యంత్రాలకు డిమాండ్ పెరిగింది. దీంతో వాటి యజమానులు అద్దె కూడా పెంచారు. గత యేడాది గంటకు రూ.2,500 నుంచి రూ. 2,800 వరకు ధరలు చెల్లించారు. ప్రస్తుత యేడాది గంటకు రూ. 2,800 నుంచి రూ. 3,500 వరకు వసూలు

మిగతా 8లో



దిగుబడి అంతంతమాత్రమే..

వానాకాలం పంటలపై రైతులు భారీగా పెట్టుబడులు పెట్టారు. ఎకరానికి రూ.25వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చుచేసినా చేతికొచ్చే దిగుబడి అంతంతమాత్రంగానే ఉంటుంది. వర్షాల కారణంగా పంట నష్టంతో అప్పులు, వడ్డీ భారాన్ని భరించాల్సిన పరిస్థితి నెలకొంది. శ్రమ వృథా అవుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి సహకరించకపోతే తమ కష్టం వర్షార్పణం అవుతోందని పేర్కొంటున్నారు.

ఉద్యోగాల కోసం దళారులను నమ్మి మోసపోవద్దు

అదనపు కలెక్టర్ రాజాగౌడ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజాగౌడ్

జగిత్యాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విదేశీ ఉద్యోగాల కొరకు నిరుద్యోగ యువతీ యువకులు దళారులను నమ్మి మోసపోవద్దని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ఇజ్రాయిల్‌లో గల నిర్మాణ రంగంలో జిప్సం వర్క్స్, సిరామిక్ టైలింగ్, ప్లాస్టరింగ్, బ్లాక్ బిల్డర్స్ ఉద్యోగాల కోసం టామ్‌కామ్‌లో నమోదు చేసుకున్న సుమారు 600 మంది అభ్యర్థులకు ప్రాథమిక ఆంగ్లం, కమ్యూనికేషన్ స్కిల్స్‌కు సంబంధించిన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అందించబడుతున్న శిక్షణ తరగతులను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్యమ్మ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

లేబర్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులు లేబర్‌కార్డులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహాయ కమిషనర్ సురేందర్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. లేబర్‌కార్డుల కోసం దళారులను ఆశ్రయించవద్దని ఆయన సూచించారు.నిర్మాణ కార్మికులు మీసేవా ద్వారా రూ.110చెల్లించి ఐదేళ్ల కాలపరిమితికి లేబర్‌కార్డు పొందాలని సూచించారు. భవన నిర్మాణ సంక్షేమ మండలి అందించే పథకాల కింద మీసేవలో దరఖాస్తు చేసుకొని జగిత్యాల, మెట్‌పల్లి సహాయ కార్మిక అధికారి కార్యాలయాల్లో నేరుగా దరఖాస్తుని సమర్పించాలని కోరారు. మీసేవా కార్యాలయాల్లో అధిక ఫీజులు వసూలు చేసినట్లయితే కలెక్టర్ కార్యాలయ సముదాయంలోని జిల్లా సహాయ కార్మిక కమిషనర్ కార్యాలయం నందు కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని లేదా సహాయ కార్మిక కమిషనర్ 9492555250 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్

సారంగాపూర్, నవంబర్, 12 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ ఆదేశించారు. మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. రోజు వారి ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. బీపీ, షుగర్ పేషంట్లకు అందించే మందుల వివరాలు, టీకాలు, రక్త పరీక్షల వివరాలను సమగ్రంగా అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఐవో డాక్టర్ శ్రీనివాస్, వైద్యాధికారి రాధ, నర్సింగ్ అధికారి దామోదర్, ల్యాబ్ సిబ్బంది జలజ, సిబ్బంది ఉన్నారు.

సబ్‌స్టేషన్‌తో రేడియేషన్ అపోహ మాత్రమే

ఎన్‌పీడీసీఎల్ టెక్నికల్ డీఈఈ గంగారాం

కథలాపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నిర్మిస్తున్న 220/132 విద్యుత్ సబ్‌స్టేషన్‌తో ఎలాంటి రేడియేషన్ ఉత్పత్తి కాదని అది అపోహ మాత్రమేనని ఎన్‌పీడీసీఎల్ డీఈఈ (టెక్నికల్) గంగారాం, డీఈఈ ఆపరేషన్ మధుసూదన్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరుగుతున్న సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేడియేషన్ ఉత్పత్రి చేసే పరికరాలు కాదని ఎలక్ట్రో మాగ్నెటిక్ ఫీల్డ్ అనే సహజ విద్యుత్ క్షేత్రం మాత్రమేనని పేర్కొన్నారు. మానవ శరీరానికి ఇవి ఎలాంటి హాని చేయవని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇంటర్నేషనల్ కమీషన్ ఆన్ నాన్ ఆయనైజింగ్ రేడియేషన్, సెంట్రల్ ఎలక్ట్రిషిటీ వంటి సంస్థలు రేడియేషన్ వల్ల ఎలాంటి ప్రమాదాలు ఉండవని స్పష్టం చేసిందని గుర్తు చేశారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం వల్ల కథలాపూర్, బీమారం, కోరుట్ల, మేడిపల్లి వంటి మండలాల్లో ఉన్న అధిక లోడ్ సమస్య పరిష్కారం కానుందని అన్నారు. ట్రాన్స్‌కో, ఎన్‌పీడీసీఎల్ సంస్థలు సంయుక్తంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ అత్యాధునిక పద్ధతుల్లో నిర్మాణం చేస్తున్నందు వల్ల ఆందోళన చెందవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏఈలు దివాకర్‌రావు, భూమేశ్వర్, సబ్ ఇంజినీర్ నవీన్, సిబ్బంది ఉన్నారు.

బోర్ మోటార్‌కు మరమ్మతు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

జగిత్యాలరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం మోరపల్లిలోని స్థానిక ఎస్సీ కాలనీలో ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించి బోర్ మోటార్‌కు బుధవారం మరమ్మతు చేశారు. వారం రోజులుగా బోర్‌మోటారు పనిచేయకపోవడంతో ఆంధ్రజ్యోతిలో 'ప్రత్యేకాధికారుల పాలనలో కుంటుపడిన అభివృద్ధి' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన జగిత్యాల రూరల్ ఎంపీడీవో రమాదేవి స్థానిక గ్రామపంచాయితీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేయగా చెడిపోయిన బోర్ మోటార్‌కు మరమ్మతులు చేసి కాలనీకి నీటిని పునరుద్ధరించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సీ కాలనీ ప్రజలు ఆంధ్రజ్యోతి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి..

కలెక్టర్ సత్యప్రసాద్

కొడిమ్యాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెం టనే రైస్ మిల్లులకు తరలిం చాలని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని పూడూర్, నాచుపల్లి, డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామాల్లోని వరిధాన్యం కొను గోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లా డుతూ నాణ్యత ప్రమాణాలను పరిశీ లించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్వహకులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

ధాన్యం అమ్మిన రైతులకు 48 గంటల లోపు చెల్లింపులు జరిగే విధంగా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రా లలో టార్పాలిన్, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలన్నారు. రైసు మిల్లుల వద్ద ఎలాంటి జాప్యం లేకుండ దిగుమతి అయ్యేలా చూడాలన్నారు. కేంద్రాలలో మౌలిక వసతులను కలిపిస్తూ, హమాలీల సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో మధుసూదన్, డీఎస్‌వో జితెందర్‌రెడ్డి, డీసీవో మనోజ్‌కుమార్, డీఎం జితేంద్ర ప్రసాద్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, సీవిల్ సప్లై డీటీ, నర్సింహ స్వామి, ఆర్ఐ కరుణా కర్, సింగిల్‌విండో చైర్మన్ రవీందర్‌రెడ్డి, కొడిమ్యాల, పూడూర్ సింగిల్ విండోల కార్య దర్శులు గంగాధర్ రాజేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

కొనుగోళ్లపై సమీక్ష

రైసు మిల్లర్లు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యాన్ని దిగుమతులు చేసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంతో కలిసి కలెక్టర్ బి.సత్యప్రసాద్ మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీ యూలో జిల్లాలోని కొడిమ్యాల, మల్యాల మండల పరిధిలోని రైసు మిల్లర్లు, రైతులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యాన్ని ఆరబెట్టుకొని కేంద్రాలకు తీసుకు రావాలన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడి పల్లి సత్యం మాట్లాడుతూ రైతులు పొలం నుంచి కోసిన తర్వాత ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకరావద్దని కోరారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని 17శాతం లోపు తేమ వచ్చిన తర్వాత కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. ధాన్యం రైసు మిల్లులకు తరలించిన తర్వాత మిల్లర్లు ధాన్యాన్ని వెంటనె దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్డీవో మధు సూధన్, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, డీసీవో మనోజ్ కుమార్, డీఎం జితేంద్ర ప్రసాద్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, సీవిల్ సప్లై డీటీ, నర్సింహస్వామి, ఆర్.ఐ కరుణాకర్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, రాంలింగారెడ్డి, నారాయణగౌడ్, రైతు నాయకులు రాంరెడ్డి, మహిపాల్‌రెడ్డి, ముత్యంరెడ్డి, మల్లేశం, చంద్రారెడ్డి, మల్లేశంయాదవ్ ఉన్నారు.



తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి నారాయణ



మాట్లాడుతున్న ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి నారాయణ

కొడిమ్యాల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అందరూ ఉత్తీర్ణత సాధించే విధంగా దృష్టి పెట్టాలని ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి నారాయణ అన్నారు. విద్యార్థులకు వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని అన్నారు. ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి ఆదేశాలతో బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా అధ్యాపకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సిలబస్, ప్రాక్టికల్స్ సకాలంలో పూర్తి చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యా ర్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అందరూ ఉత్తీర్ణత సాధించే విధంగా దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులందరిని వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. బోర్డు నియమ నిబంధనల మేరకు ప్రతి ఒక్కరు విధులు నిర్వహించాలన్నారు. అంతక ముందు కళాశాలలో జరుగుతున్న మరమ్మతు పనులను, రికార్డులను, విద్యార్థుల, అధ్యాపకుల హాజరు పట్టికలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.వేణు, అధ్యాపకులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ అంది స్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి పట్టణానికి చెందిన క్లబ్ అధ్యక్షులు వెల్మల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో బసవతార ఇండో అమెరికా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ సౌజన్యంతో ఉచిత క్యాన్సర్ నిర్ధారన శిబిరాన్ని పీహెచ్‌సీ వైద్యురాలు వాహిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు రవిశంకర్, రేణుక ప్రవళిక, హరిష్, పి.ఆర్.ఓ మేనేజర్ బిందు, పబ్లిక్ హెల్త్ మేనేజర్ ప్రేరణలు పాల్గొని ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు మాటాడుతూ లయన్స్‌క్లబ్ అందిస్తున్న వివిధ రకాల సేవలను ప్రజలు సద్విని యోగం చేసుకోవాలన్నారు. జరిగిన ఉచిత వైద్య శిబిరంలో క్లబ్ కోశాధికారి చంద్రశేఖర్, పోలీస్ శ్రీనివాస్, ముద్దం రాజేంద్రప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు ఇప్పించాలి

జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి బి. ప్రకాష్

జగిత్యాలరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇప్పించాలని జగిత్యాల జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి. ప్రకాష్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం లోని అంతర్గాం గ్రామంలో నిర్వహిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలిక కుంటు వ్యాధి ప్రాణాంతకమైందని, ఈ వ్యాధి అతి సూక్ష్మాతి, సూక్ష్మ జీవుల వలన పశువులకు ప్రబలి అధిక జ్వరం నోటిలో పొక్కులు, సొంగ కారడం, మేతమేయలేని స్థితి వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ లక్షణాలు కనబడితే వెంటనే పశువైద్యులను సంప్రదించాలని పాడి రైతులకు సూచించారు. ఈకార్యక్రమంలో పశుగణాంక అధికారి ఎలిగేటి రవీందర్, పశువైద్య సహాయకుడు రాజేందర్, సిబ్బంది అనిల్, పోశయ్య, మణిచంద్, శ్రీధర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

- **రాయికల్:** ప్రజలు టీకాల కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని జగిత్యాల జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మైతాపూర్ గ్రామంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీఇలంచారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు మాంకిడి శ్రీనివాస్, ఇల్లెందుల శ్రీనివాస్, ఏఎన్ఎం ప్రశాంత కుమారి, ఆశ కార్యకర్త శంకరమ్మ పాల్గొన్నారు.
- పెగడపల్లి : పశువులకు ఆరు నెలకోమారు గాలి కుంటు టీకాలు విధిగా వేయించాలని పెగడపల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ హేమలత పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నామాపూర్‌లో పశువులకు గాలికుంటు టీకాలు శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మతిన్, వినీత్, గోపాలమిత్రలు జానీపాష, శంకరయ్య, తిరుపతి తదితరులు ఉన్నారు.



గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి

- సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

8

అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

పనుల్లో నాణ్యత పాటించాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

8



చెక్కులను అందిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి

● భార్యకు తీవ్ర గాయాలు


ఆవుల రవి(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోర్టు సమీపంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆవుల రవి(42) దుర్మరణం చెందారు. అతని భార్య సంతోషినికి తలకు గాయాలయ్యాయి. త్రీటౌన్ సీఐ జి జాన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కేశాపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న ఆవుల రవి కరీంనగర్‌లోని రాంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో భార్య సంతోషినితో కలిసి మోటార్‌సైకిల్‌పై కోర్టు చౌరస్తా నుంచి మంచిర్యాల చౌరస్తా వైపునకు వెళ్తున్నారు. రోడ్డు పక్కన పార్క్ చేసి ఉన్న కారును డ్రైవర్ హఠాత్తుగా రోడ్డుపైకి రావడంతో వీరి బైక్‌ను కారు ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఆవుల రవి కుడివైపుకు, ఆయన భార్య సంతోషిని ఎడమ వైపుకు రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో అటుగా వస్తున్న ఒక ట్యాంకర్ అతివేగంగా వచ్చి రవిని ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఉపాధ్యాయుడు రవి అక్కడికక్కడే మృతి చెందాడు. సంతోషిని తలకు గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. మృతుడు రవికి కొడుకు రిత్విక్, కూతురు హాసిని ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ జాన్‌రెడ్డి తెలిపారు.

బావిలో దూకి విద్యార్థి ఆత్మహత్య


విశ్వతేజ్(ఫైల్)

పెద్దపల్లిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బావిలో దూకి ఓ విద్యార్థి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే పెద్దపల్లి పట్టణంలోని భూంనగర్‌కు చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఈర్ల స్వరూప సురేందర్‌ల ఏకైక కుమారుడు విశ్వతేజ్(17) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. మంగళవారం కాలేజీ నుంచి ఇంటికి వచ్చిన విశ్వతేజ్ సాయంత్రం వరకు స్నేహితులతో గడిపాడు. అనంతరం బందంపల్లి వద్ద రాజీవ్‌రహదారి పక్కన ఉన్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికారు. ఫోన్లు చేసి తెలుసుకునే ప్రయత్నం చేశారు. బుధవారం ఉదయం బందంపల్లి బావి వద్ద సెల్ ఫోన్, చెప్పులు కనిపించడంతో తల్లిదండ్రులకు సమాచారం అందింది. దీంతో జాలర్లను పిలిపించి బావి అంతా వెతికించారు. సుమారు గంట పాటు వెతకగా మృతదేహం లభించింది. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

● నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ
● ఇప్పటి వరకు ఉద్యోగాలు సాధించిన 286 మంది అభ్యర్థులు



కరీంనగర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్

నిరుద్యోగులకు దిక్సూచి.. అంబేడ్కర్ స్టడీ సర్కిల్


స్టడీ సర్కిల్‌లో విద్యార్థులు

గణేశ్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ రంగాల్లో ఎన్నిక అవకాశాలున్నా ప్రభుత్వ ఉద్యోగాలకున్న విలువ ఎప్పటికీ తగ్గదు. అందుకే వందల్లో ఉద్యోగాలుంటే లక్షల్లో దరఖాస్తులు వస్తుంటాయి. యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం కష్టపడి చదువుతున్నారు. అటువంటి వారికి మార్గ నిర్దేశం చేస్తూ అవసరమైన శిక్షణ అందిస్తోంది ఎస్సీ స్టడీ సర్కిల్. ప్రైవేట్ సంస్థల్లో లక్షలు పెట్టి చదవలేని వారికి అండగా నిలుస్తోంది. 2016 సంవత్సరంలో కరీంనగర్‌లో అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటైంది. ఇక్కడ శిక్షణ తీసుకున్న 286 మంది అభ్యర్థులు ఉద్యోగాలను సాధించారు.

● అర్హత.. శిక్షణ.. సౌకర్యాలు

కనీసం డిగ్రీ పాసై వార్షిక ఆదాయం మూడు లక్షల రూపాయల లోపు ఉన్న ఉమ్మడి జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులు అర్హులు tsstudycircle.co.in అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ కనపరచిన వంద మందికి ఐదు నెలలపాటు ఉచిత శిక్షణను అందిస్తారు. ఫౌండేషన్ కోర్స్ పేరున ఇస్తున్న ఈ శిక్షణలో పలు నోటిఫికేషన్ల సిలబస్‌ను కవర్ చేసే విధంగా నిష్ణాతులైన అధ్యాపకులను బోధిస్తారు. ఉచిత శిక్షణ, ఉచిత భోజన వసతి ఉంటుంది. ఇతర అలవెన్స్‌ల కింద పుస్తకాల కొనుగోలుకు ఒక్కరికి 2500 రూపాయలు ఇస్తారు. నోట్‌బుక్స్, బౌండెడ్ మెటీరియల్ ఉచితంగా ఇస్తారు. ఇప్పటి వరకు రెసిడెన్షియల్ విధానంలో 10 బ్యాచ్‌లలో 918 మందికి, నాన్ రెసిడెన్షియల్ విధానం లో 2 బ్యాచ్‌లలో 264 మందికి శిక్షణ ఇచ్చారు. మొత్తం 12 బ్యాచ్‌లలో 1,182 మంది శిక్షణ పొందగా వారిలో ఇప్పటి వరకు 286 మంది ఉద్యోగాలను సాధించారు. మరో 16 మంది ఉద్యోగాలకు ఎన్నికయ్యారు. వారికి నియామకపత్రాలు రావాల్సి ఉంది.

నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి

-ఐంది శ్రీనివాస్, అంబేద్కర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్



విద్యార్థులు డిగ్రీ కనీస అర్హతతో వ్రాయడానికి వీలైన అన్ని పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నాం. ఆడియో, వీడియోల బోధన ఉంటుంది. మోడల్ టెస్టులు నిర్వహించి అభ్యర్థుల సామర్థ్యాన్ని తెలుసుకుంటున్నాం. ఉచిత శిక్షణను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి.

శిక్షణ చాలా ఉపయోగపడింది..

- గొల్లపల్లి రాజు, డిప్యూటీ తహసీల్దార్



డబ్బులు చెల్లించి కోచింగ్ తీసుకునే పరిస్థితి లేని సమయంలో కరీంనగర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో ఇచ్చిన కోచింగ్ నాకు చాలా ఉపయోగపడింది. ఐదు నెలల శిక్షణను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించాను. మాకు ఇచ్చిన కోచింగ్, మెటీరియల్ చాలా ఉపయోగపడింది.

నాణ్యమైన కోచింగ్ ఇస్తున్నారు..

- బి ధనుంజయ్, సూపరింటెండెంట్, పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ



అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో నాణ్యమైన కోచింగ్ ఇస్తున్నారు. ఇక్కడ కోచింగ్ తీసుకున్న తర్వాత ఉద్యోగం సాధించగలనని నమ్మకం కలిగింది. ఉద్యోగ ప్రయత్నంలో ఉన్న వారు ఇక్కడ కోచింగ్ తీసుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చు.

టిప్పర్ ఢీకొని గొర్రెల మృతి


మృతి చెందిన గొర్రెలు

కల్హేర్‌రాంపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగడపల్లి గ్రామశివారులో టిప్పర్ ఢీకొని తొమ్మిది గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. మరికొన్ని గొర్రెలకు గాయాలయ్యాయి. బుధవారం పెగడపల్లి శివారులోని శ్రీమల్లి కార్తున ఫంక్షన్ హాల్ సమీపంలో ఓ టిప్పర్ గొర్రెలను ఢీకొంది. ఇందులో తొమ్మిది గొర్రెలు మృతిచెందగా, రెండు గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. సుల్తానాబాద్ నుంచి కల్హేర్‌రాంపూర్ వస్తున్న టిప్పర్ రోడ్డు దాటుతున్న గొర్రెలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని యజమాని వల్లపు మల్లయ్య పేర్కొన్నాడు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

సుల్తానాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతకుంటపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో ఒక గేదె మృతి చెందింది. బుధవారం గ్రామానికి చెందిన లింగంపల్లి కొమురయ్య గేదె మేతకు వెళ్లగా అక్కడ నీటిలో ఉన్న ఐరన్ విద్యుత్ స్తంభానికి తాకి విద్యుదాఘాతంతో మృతి చెందింది. గేదె విలువ రూ.60 వేల వరకు ఉంటుందని, తనకు నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని రైతు కొమురయ్య విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

కోల్‌సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన కనకం గణేష్‌పై మంగళవారం రాత్రి దాడికి పాల్పడిన నల్లగొపాల రంజిత్, అతని భార్య లతపై కేసు నమోదు చేసినట్టు గోదావరిఖని వన్‌టౌన్-2 సీఐ రవీందర్ తెలిపారు. కనకం గణేష్ మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా అదే కాలనీకి చెందిన రంజిత్ తనను ఇంటి వద్ద దింపాలని కోరాడు. అతన్ని ఇంటి వద్ద దింపిన తరువాత తనపై ఎక్కిన్ ఫోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ కులం పేరుతో దూషిస్తూ కర్రలను, ఇనుప రాడ్లతో దాడి చేసి ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేసి పలువురు హత్యకు పాల్పడ్డాడని, అతని భార్యను కత్తి తీసుకురా అని పురమాయించినట్టు తెలిపారు. గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంజిత్, అతని భార్య లతపై కేసు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

లంచం అడిగారా... 1064కు కాల్ చేయండి

● 10 నెలల్లో 22 కేసులు, 35 మంది అరెస్టు ● ఉమ్మడి కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్



కరీంనగర్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విధిగా చేయాల్సిన పనికోసం ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే వెంటనే ధైర్యంగా అవినీతి నిరోధకశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఉమ్మడి కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ కోరారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... సమాజంలో అవినీతి ఒక పెద్ద సమస్యగా మారిందన్నారు. ఆ అవినీతి జాడ్యాన్ని అరికట్టే శక్తి మన చేతుల్లోనే ఉందన్నారు. లంచం అడగడం నేరమని, లంచం తీసుకోవడం కూడా నేరమని, లంచం ఇవ్వడం కూడా నేరమని తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, పౌరులకు సేవలు అందించాల్సిన ఉద్యోగి విధులను మరచి అవినీతికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏ స్థాయిలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం అడిగితే భయపడకుండా వెంటనే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఏసీబీ పోలీసులకు నేరుగా ఫిర్యాదు చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారి పేరు, వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రజలు అవినీతిపై చైతన్యవంతులై తిరగబడితేనే అవినీతి రహిత తెలంగాణ సాధ్యమన్నారు. సత్యం కోసం, మన కర్తవ్యం కోసం, అవినీతి రహిత తెలంగాణ కోసం సంకల్పంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 2025 సంవత్సరంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగుల లంచం డబ్బులు తీసుకుంటుండగా ఇప్పటి వరకు 22 కేసుల్లో 35 మంది ఉద్యోగులు, వారి సహాయకులను అరెస్టు చేసి జైలుకు తరలించామన్నారు. ఇందులో రెవెన్యూశాఖకు చెందిన ఎనిమిది మంది ఉద్యోగులు, పంచాయతీ రాజ్ శాఖ-6, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ- 3, ఖజానా శాఖ 3, మున్సిపల్-3, వ్యవసాయశాఖ-3, డ్రగ్ కంట్రోల్-3, ఆర్‌టీఏ-3, పోలీసుశాఖలో ఒక కేసు నమోదు చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామని ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

సుల్తానాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తిచెంది, మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ట్లు సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్‌కుమార్ బుధవారం రాత్రి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. సుల్తానాబాద్ మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన జెట్టి రాజ కొమురయ్య(60) భార్య నాలుగు సంవత్సరాల క్రితం మృతిచెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసగా మారాడు. తీవ్రమానసిక వేదనకు గురై కొడుకు సదయ్య చెంతనే ఉంటున్నాడు. మంగళవారం రాత్రి కదంబాపూర్ శివారులో ఉన్న తమ పొలం వద్ద గల వ్యవసాయ బావి దగ్గరకు వెళ్లి వెంటతెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న తండ్రిని చూసిన కొడుకు వెంటనే కొమురయ్యను సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం అతన్ని కరీంనగర్‌లో ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రావణ్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

పెద్దపల్లి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మపల్లి గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకుర్తికి చెందిన పరశురాం అనే వ్యక్తి కాలినడకతో వెళ్తున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో పరశురాంనకు తీవ్రగాయాలు కాగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

జీడీకే11 ఇంక్లైన్‌లో ప్రమాదం

● ముగ్గురు కార్మికులకు గాయాలు

గోదావరిఖని, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే 11ఇంక్లైన్‌లో బుధవారం గనిలో ప్రమాదం జరిగింది. రెండవ షిఫ్టులో పనిచేస్తున్న ముగ్గురు కార్మికులకు గాయాలయ్యాయి. ఎల్‌హెచ్‌డీ సెక్షన్‌లో ఎల్‌హెచ్‌డీలు నడుపుతున్న క్రమంలో వాహనం వెనుక వస్తూ చేస్తున్న కార్మికులు రంజిత్, శ్రీకాంత్, ప్రవీణ్‌కు అక్కడున్న కేబుల్ వైర్ బలంగా తాకినట్టు తెలిసింది. దీంతో వారు కిందపడ్డారు. శ్రీకాంత్, ప్రవీణ్‌కు స్వల్ప గాయాలు కాగా, రంజిత్‌కు బలమైన గాయాలు తగిలాయి. స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రిలో వీరికి చికిత్స అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

సుల్తానాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్నపల్లి నర్సయ్యపల్లి గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి శివారులో గల ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఓ కార్మికుడు బుధవారం రాత్రి రాజీవ్‌రహదారి దాటుతుండగా రోడ్డుపై వెలుతున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో కార్మికుడితో పాటు ద్విచక్రవాహనం నడుపుతున్న వ్యక్తి కూడా తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బిల్డింగ్ పైనుంచి పడి ఒకరికి తీవ్ర గాయాలు

రుద్రంగి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బిల్డింగ్‌కు నీళ్ల పడుతుండగా ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కిందపడి తీవ్రగాయాలపాలైన సంఘటన రుద్రంగి మండల కేంద్రంలో బుధవారం ఉదయం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన గండం శంకర్ తన ఇంటి నిర్మాణంలో భాగంగా గోడకు నీళ్లు పడుతున్న క్రమంలో ఒక్కసారిగా మొదటి అంతస్తు నుంచి కిందపడ్డాడు. దీంతో తలకు, నడుముకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

రిటైర్డ్ ఏఎస్సై రామచంద్రం కన్నుమూత


రాంచంద్రం(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో సీనియర్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేసి, రిటైర్డ్ అయిన ఏఎస్సై మడుపు రామచంద్రం(69) బుధవారం అనారోగ్యంతో కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. రామచంద్రం అంత్యక్రియలు ఆయన స్వగ్రామం కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లో గురువారం మధ్యాహ్నం నిర్వహించనున్నారు. రాంచంద్రం మృతికి పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు. సుదీర్ఘకాలంపాటు పోలీస్ శాఖకు రామచంద్రం అందించిన సేవలు మరువలేనివన్నారు. సీనియర్ ఫొటోగ్రాఫర్‌గా ఆయన చేసిన కృషి ఎంతోమందికి ఆదర్శప్రాయమన్నారు.

పెద్దమ్మ ఆలయంలో పోతరాజు విగ్రహం ధ్వంసం

ఓదెల, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లిలో బుధవారం పెద్దమ్మతల్లి ఆలయంలో నిర్మించిన పోతరాజు విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తి ధ్వంసం చేశాడు. రాత్రి మద్యం సేవించిన ఒక్కవ్యక్తి పొత్కపల్లి రైల్వేస్టేషన్ నుంచి వస్తూ విగ్రహాన్ని ధ్వంసం చేసినట్టు తెలిసింది. ఆ వ్యక్తిని పోలీసులకు అప్పగించారు.

బహ్రెయిన్‌లో జగిత్యాల యువకుడి ఆత్మహత్య

● పుట్టిన రోజునే ఘటన
● జగిత్యాలలో మిన్నంటిన రోదనలు

జగిత్యాల టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎదిగిన కొడుకు కుటుంబానికి ఆసరాగా ఉంటాడని గల్ఫ్‌కు పంపిస్తే ఏం జరిగిందో ఏమో కానీ పుట్టిన రోజునే తల్లిదండ్రులతో సంతోషంగా మాట్లాడిన ఆ యువకుడు ఆత్మహత్య చేసుకుని ఆ కుటుంబంలో విషాదం నింపాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని టాకా సందిలో ఉంటున్న అనుమల్ల శంకర్ ఓ కల్లు దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఆయన భార్య లావణ్య ఆశ వర్కర్‌గా పనిచేస్తున్నారు. వారికి కల్యాణ్ (26)కొడుకు, ఒక కూతురు ఉన్నారు. ఎదిగిన కొడుకును గల్ఫ్‌కు పంపితే నాలుగు రూపాయలు సంపాదించి ఇంటికి చేదోడుగా ఉంటాడని 10 నెలల క్రితం కళ్యాణ్‌ను బహ్రెయిన్ దేశానికి పంపించారు. అక్కడ ఓ సర్వీసింగ్ సెంటర్లో పనిచేస్తూ ప్రతి నెలా ఇంటికి డబ్బులు పంపించేవాడు. మంగళవారం రోజున కళ్యాణ్ బర్త్‌డే సందర్భంగా కుటుంబ సభ్యులతో కూడా చాలా సంతోషంగా మాట్లాడాడు. రాత్రి ఏం జరిగిందో ఏమోకానీ ఉదయం చూసేసరికి తన గది వద్ద కల్యాణ్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని కల్యాణ్ స్నేహితులు జగిత్యాలలో ఉన్న తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తన కొడుకును కష్టపెట్టి ఇబ్బందులు లేవని, ఎప్పుడు తమతో సంతోషంగానే మాట్లాడేవాడని బర్త్‌డే సందర్భంగా కూడా మాతో ఫోన్‌లో సంతోషంగానే మాట్లాడాడని అంతలోనే ఏం జరిగిందో అంతుపట్టడం లేదని యువకుడి తండ్రి రోదిస్తూ తెలిపాడు. ఆత్మహత్యకు కారణాలు తెలుసుకొని మృతదేహాన్ని త్వరగా తెప్పించే ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నాడు.


జగిత్యాలలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు , కళ్యాణ్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


హర్షిత్(ఫైల్)

హుజూరాబాద్ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్సపల్లి క్రాస్ రోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని పోతిరెడ్డిపేటకు చెందిన నందిపేట హర్షిత్(18), అతడి బంధువు త్రివేష్ ద్విచక్ర వాహనంపై హుజూరాబాద్ వైపు వెళ్తున్నారు. సిర్సపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో రాగానే వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీంది. ఈ ప్రమాదంలో హర్షిత్, త్రివేష్ ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నందిపేట హర్షిత్ మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

ఒకరి ఆత్మహత్య


శ్రీనివాస్(ఫైల్)

యైటింక్లయిన్ కాలనీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి కాలనీలోని బాసర్‌రావు నగర్‌కు చెందిన బండారి శ్రీనివాస్(42) బుధవారం ఉరి వేసు కుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో బెడ్‌రూంలో చీరతో సీలింగ్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తాడిచర్ల ఓసీపీలో బ్లాస్టింగ్ సెక్షన్‌లో ప్రైవేట్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ పెళ్లిరోజు బుధవారం కావడం తో కుటుంబంలో విషాదం నింపింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీనివాస్ మృతికి కారణాలు తెలియరాలేదు. పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

వెల్గటూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల కేంద్రంలో బుధవారం ఓ వృద్ధుడిని ఎనగందుల పోచయ్య అనే వృద్ధుడిని ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం సంత కావడంతో పోచయ్య సంత నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో కోటిలింగాల నుంచి వస్తున్న యువకుడు బైక్‌పై వెల్గటూర్ వృద్ధుడిని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో వృద్ధుడు కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోచయ్యను జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. కాగా అతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

ట్రాలీ బోల్తా.. తప్పిన ప్రాణాపాయం

వెల్గటూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం రాజక్కపల్లి వద్ద రాష్ట్ర రహదారిపై బుధవారం ట్రాలీ బోల్తా పడగా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచి పోయాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ గోషామహల్ నుంచి ఫైబర్ లోడ్‌తో లక్షెట్టిపేట వైపు వస్తున్న ట్రాలీ రాజక్కపల్లి సమీపంలో టైరు పేలడంతో రాష్ట్ర రహదారిపై బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడడంతో ప్రాణాపాయం తప్పింది. ట్రాలీ ఉన్న ఫైబర్ కర్రలు చెల్లాచెదురుగా రోడ్డుపై పడిపోయాయి. దీనితో రహదారిపై భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీసీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్ స్పందించి స్థానిక యువకుల సహాయంతో కర్రలను తొలగించారు. కాగా ట్రాలీ వెనుక ముందు ఎలాంటి వాహనాలు రాక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఎస్సై శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.


రోడ్డుపై పడిపోయిన ఫైబర్ కర్రలు

భక్తుల దారి దోపిడీ

● బంగారు పుస్తెల తాడు, నగదు లాక్కెళ్లిన అగంతకుడు


వృద్ధుడిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న పోలీసులు

వేములవాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నాంపల్లి లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి ఆటోలో వెళుతున్న భక్తులను లక్ష్యంగా చేసుకున్న అగంతకుడు వెంబడించి బుధవారం దారి దోపిడీకి పాల్పడ్డాడు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన దేవపల్లి బూదవ్వ, చంద్రయ్య అనే వృద్ధ దంపతులు వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనం చేసుకొని నాంపల్లికి వెళుతున్నారు. వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి నాంపల్లి దేవాలయానికి వెళ్లేందుకు భక్తులు ఆటోలో ఎక్కగా మార్గమధ్యలో ఒక వ్యక్తి, మరోచోట ఇంకో వ్యక్తి ఎక్కారు. నాంపల్లి కమాన్ వద్ద భక్తులు దిగగానే అగంతకుడు వారి వెంబడించి నడుచుకుంటూ వెళుతున్న దంపతులను చంపుతానని బెదిరించి రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడు, రూ. 2వేల నగదు లాక్కొని పరారయ్యాడు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేశారు.

16న ఉమ్మడి జిల్లాస్థాయి
జూనియర్స్ ఖో-ఖో పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి జూనియర్స్ ఖో-ఖో పోటీలను ఈ నెల 16న కోరుట్లలో నిర్వహించనున్నట్లు జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రావు తెలిపారు. కోరుట్ల స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో కరీంనగర్ నుంచి రెండు బాలుర, ఒక బాలికల జట్టు, జగిత్యాల నుంచి రెండు బాలుర, ఒక బాలికల జట్టు, సిరిసిల్ల నుంచి రెండు బాలుర, ఒక బాలికల జట్టు పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచే జట్లకు నగదు బహుమతులతోపాటు ప్రతిభచాటే క్రీడకారులను రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. బాలబాలికల ఎత్తు, వయస్సు, బరువు మొత్తం కలిసి 250 పాయింట్లు దాటకూడదని పేర్కొన్నారు. పోటీలను లీగ్‌కం నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నామని తెలిపారు. ఇతర వివరాలకు పోటీల నిర్వాహక కార్యదర్శి వి.నవీన్‌కుమార్ 8341136941 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పత్రికలు చదవడం పెరగాలి
- ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

సిరిసిల్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ వినియోగం తగ్గించుకుని పత్రికలు చదవాలని ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమల సత్యం అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ సమావేశలో మాట్లాడారు. డిస్ట్రిబ్యూషన్ కమిషన్ పెంచాలని అన్నారు. రాష్ట్ర కోశాధికారి ఉప్పు రాజేందర్, రాష్ట్ర ఆర్గనైజర్ కార్య దర్శి రణం రవీందర్‌గౌడ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కురికాల ప్రసాద్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు పోచపల్లి రాజు ఉన్నారు.

- అర్ధరాత్రి తర్వాతనే ప్రధాన ద్వారం మూసివేత
- ముందస్తు సమాచారం లేకపోవడంతో భక్తుల ఆందోళన
- భీమేశ్వరాలయంలోనే భక్తులకు దర్శనం, ఆర్జిత సేవలు
- ఎల్ఈడీ తెరపై రాజన్న దర్శనం
- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు

రాజన్న దర్శనాల నిలిపివేత


ఎల్ఈడీ తెరపై రాజన్నను దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్


పోలీసు పహారాలో దక్షిణభాగం ప్రధాన ద్వారం

వేములవాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల నేపథ్యంలో స్వామివారి దర్శనాలను బుధవారం తెల్లవారుజామున ముందస్తు సమాచారం లేకుండానే నిలిపివేశారు. భక్తులు ఆలయంలోకి రాకుండా తూర్పువైపున ఉన్న రాజగోపురం దక్షిణం వైపున్న ప్రధాన ద్వారం గేటును మూసివేసి ఇనుప రేకులతో ఫెన్సింగ్ చేశారు. ఆలయం చుట్టూ ఇప్పటికే పడమర, ఉత్తరం వైపు ఎత్తయిన రేకులతో ఫెన్సింగ్ చేసి రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా నెలరోజుల నుంచి కూల్చివేతలు కొనసాగుతున్నాయి. దక్షిణం, ఉత్తర భాగాల్లో ఉన్న ప్రాకారం, పడమర వైపున్న నైవేద్యశాల, ఈవో కార్యాలయం, తూర్పు భాగంలోని కళాభవన్‌లను ఇప్పటికే తొలగించారు. చివరికి మెయిన్ గేట్‌ను ఇనుప రేకులతో మూసివేశారు. కోడె మొక్కులు, ఆర్జిత సేవలు భీమేశ్వరాలయంలో జరుగుతాయని పేర్కొంటూ ప్రధాన ద్వారానికి ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దర్శనాల నిలిపివేత పనులను ఈవో రమాదేవి, ఆర్డీవో రాధాబాయి, అడిషనల్ ఎస్పీ చంద్రయ్యల సమక్షంలోనే రాత్రంతా ఇంజ నీరింగ్ అధికారులు పూర్తిచేశారు. దీంతో సుప్రభాత దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయ గేటు వద్దనే టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. మరోవైపు పడమర వైపున్న శివుడి విగ్రహం వద్ద కొబ్బరికాయలు కొట్టి దీపాలు వెలిగించారు. ముందస్తు సమాచారం లేకుండా ఆలయంలో దర్శనాలను నిలిపివేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమైంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. భీమేశ్వ రాలయంలో సకల ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో రమాదేవి ప్రకటించారు. ఆలయ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. ఆలయంలో ముందస్తు సమాచారం లేకుండా దర్శనాలను నిలిపివేయడాన్ని బీజేపీ నాయకుడు ప్రతాప రామకృష్ణ తీవ్రంగా ఖండించారు.

అభివృద్ధిలో భాగంగానే రాజన్న దర్శనాలకు తాత్కాలిక ఏర్పాట్లు
• ఆలయ ఈవో రమాదేవి

వేములవాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి పనుల్లో భాగంగానే స్వామివారి దర్శనాలకు తాత్కాలిక ఏర్పాట్లుచేశామని ఈవో ఎల్. రమాదేవి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయ విస్తరణ పనులు వేగవంతం అయినందున భక్తులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉన్నదని గుర్తించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి ఆజ్ఞానుసారం భక్తుల సౌకర్యార్థం ఆలయ రాజగోపురం ఎదురుగా తూర్పువైపు స్వామివారు, అమ్మవార్ల దర్శనం ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే భీమేశ్వరాలయంలో ఆర్జిత సేవలైన అభిషేకాలు, అన్నపూజలు, అర్చనలు, కల్యాణాలు ఏర్పాటు చేశామన్నారు. ఇకనుంచి భీమేశ్వరాలయంలో భక్తులు మొక్కులు చెల్లించుకోవాలన్నారు.

భీమేశ్వరాలయంలోనే భక్తులకు దర్శనం..

భక్తులు ఇకనుంచి భీమేశ్వరాలయంలో దర్శన ఏర్పాట్లు చేశారు. అన్ని రకాల ఆర్జిత సేవలు, పూజలు భీమేశ్వరాలయంలో చెల్లించేలా ఏర్పాట్లుచేశారు. ఆలయ అభివృద్ధి పనుల దృష్ట్యా రావిచెట్టు వైపు ఏర్పాటుచేసిన ప్రచార రథంలో రాజరాజేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. అక్కడే ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. గతనెల 20న శృంగేరి పీఠాధిపతి శ్రీవిధుశేఖర భారతితో దీనిని ప్రారంభించారు. ఇకనుంచి ఎల్ఈడీ స్క్రీన్‌లో స్వామివారిని దర్శించుకోవచ్చు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అశోక్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జగిత్యాల ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న బాలాజీ అనే విద్యార్థి జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎంపిక పోటీలు శాతవాహన వర్సిటీ పరిధిలో జరిగాయన్నారు. డిసెంబర్‌లో జరగబోయే జాతీయ ఇంటర్ యూనివర్సిటీ ఆల్ ఇండియా బాక్సింగ్ పోటీలు కురుక్షేత్ర విశ్వవిద్యాలయం హర్యానా రాష్ట్రంలో జరుగుతాయని, ఈ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ అశోక్, కళాశాల అధ్యాపకులు, సహచర విద్యార్థులు బాలాజీని అభినందించారు.

వచన కవిత పోటీల్లో విద్యార్థి ప్రతిభ


రాహుల్

ధర్మారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సారస్వత పరిషత్తు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో నిర్వహించిన పోటీల్లో మండలంలోని నర్సింహులపల్లి ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న అలిశెట్టి రాహుల్ సత్తాచాటాడు. వచన కవిత, పద్య కవిత, కథ, పుస్తకసమీక్ష, చిత్రలేఖనం అంశాలలో పోటీల నిర్వహించగా రెండు రాష్ట్రాల నుంచి 1200మంది విద్యార్థులు పోస్టు ద్వారా తమ రచనలను పంపారు. న్యాయ నిర్ణేతలు బుధవారం విజేతలను ప్రకటించగా వచన కవిత విభాగంలో రాహుల్ రాసిన 'పెన్ను' కవితకు తృతీయబహుమతి లభించింది. ఈ నెల23న, హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సారస్వత పరిషత్తు భవనంలో జరిగే సమావేశంలో రాహుల్‌కు 1000రూపాయల నగదు బహుమతితోపాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించనున్నారు. రాహుల్‌ను ప్రధానోపాధ్యాయుడు రమేష్ నాయక్, ఉపాధ్యాయులున్నారు.

ఉపాధ్యాయ సంఘం కార్యవర్గం

కరీంనగర్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీఎస్ యూటీఎఫ్ అనుబంధంగా పనిచేస్తున్న తెలంగాణ మైనార్టీ గురుకుల ఉపాధ్యాయ సంఘం (టెమ్రిస్) ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర కార్యదర్శి భూపేందర్‌కౌర్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముల్కల కుమార్, కేఏ జావేద్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఒల్లాల శ్రీనివాస్ (కరీంనగర్), ప్రధాన కార్యదర్శిగా షేక్ బాబా, ఉపాధ్యక్షులుగా రెవోజు స్వామి, అనిత, కోశాధికారిగా జి.సంధ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్లుగా నిజాముద్దీన్, ఎం.శ్రావణి, కార్యదర్శులుగా కె.శ్రావణి, క్రాంతికుమార్, జి.సుచరిత, ఎన్.హరికృష్ణ, కె.చిరంజీవి, జి.శ్రీకాంత్, డి.శ్రీలత, సంయుక్త, సాహిత్య, డి.వినోద, ఎ.హరీష్, ఎ.శ్రీలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మైనార్టీ గురుకుల ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని వారు కోరారు.

పెన్షనర్ల సమస్యల సాధనకు పోరాటం

- 17న హైదరాబాద్‌లో మహాధర్నా
- 'రేవా' రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి


కరపత్రం ఆవిష్కరిస్తున్న పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు

కరీంనగర్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యల సాధనకు పోరాటం చేపట్టినట్లు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి తెలిపారు. బుధవారం నగరంలోని ప్రైవేట్ కళాశాలలో రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు గద్దె జగదీశ్వరాచారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏడాదిన్నరకాలంగా ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగులకు రావాల్సిన జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కమ్యూటేషన్, గ్రాట్యూటీ అందలేదని ఆవేదన చెందారు. బకాయిలు అందకపోవడంతో పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారని, గతంలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదని అన్నారు. ఈ విషయమై ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతుందని, విధిలేని పరిస్థితిలో మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టాల్సి వస్తోందని అన్నారు. ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద పెన్షనర్ల మహాధర్నా నిర్వహించనున్నట్లు అనంతరం మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకెశాల ప్రభాకర్‌రావు, కోశాధికారి కనపర్తి దివాకర్, సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు వంగ సుధాకర్, పాలోజు రవీందర్ పాల్గొన్నారు.

పరమ పవిత్రం కార్తీక దీపం



ధర్మపురి గోదావరి నది వద్ద హారతి ఇస్తున్న అర్చకులు, మహిళలు

ధర్మపురి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీక దీపం పరమ పవిత్రమని ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ అన్నారు. కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 22వ రోజు బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌శర్మ భక్తులను ఉద్దేశించి ధార్మిక ప్రసంగం చేశారు. కార్తీక మాసంలో నెల రోజుల పాటు దీపాలు వెలిగించడం ఎంతో శ్రేష్టమని అన్నారు. అనంతరం రాత్రి వరకు నదీ మాతకు హారతి ఇచ్చారు. మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఉన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


అక్షిత్‌రెడ్డి, సిద్దు

సిరిసిల్ల టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ బాలుర జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని వాలీబాల్ అకాడమీకి చెందిన విద్యార్థులు అక్షిత్‌రెడ్డి, సిద్దు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి అండర్-19 విభాగం వాలీబాల్ పోటీల్లో సిరిసిల్ల వాలీబాల్ అకాడమికి చెందిన అక్షిత్‌రెడ్డి, సిద్దు తమ క్రీడా ప్రతిభతో జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం సిరిసిల్లలో వీరిని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, ప్రధానకార్యదర్శి అజ్మీరా రాందాస్, ఉపాధ్యక్షుడు చింతకింది శ్యాంకుమార్, కోశాధికారి కోడం శ్రీనివాస్, గుడ్ల రవి, అకాడమి శిక్షకులు సంపత్, జగన్ అభినందించారు.

రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీలకు ఎంపిక


రామంచ సహస్ర

ముత్తారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన రామంచ సహస్ర రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీలకు ఎంపికైంది. రాజేశం-వాణి దంపతుల కుమార్తె సహస్ర రామగుండంలోని గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నది. అండర్ 14 పోటీల్లో జిల్లాస్థాయి 400మీటర్ల రన్నింగ్ పోటీల్లో 2వ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. సహస్రను ఉపాధ్యాయబృందం, తల్లితండ్రులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన తాటిపల్లి గురుకుల, బాలికల పాఠశాల విద్యార్థులు

మల్యాల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మల్యాలలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం నీరజ, పీడీ అంజయ్య తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో జరిగిన పోటీలలో లాస్య, చంద్రకళ అనే విద్యార్థినీలు మూడువేల మీటర్ల రేస్, డిష్కస్‌త్రోలో సిల్వర్, బంగారు పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే నూకపల్లిలో గల ప్రతిభ స్కూల్‌కు చెందిన హనుమాన్ అనే విద్యార్థి 600మీటర్ల రేస్‌లో వెండి పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని కరస్పాండెంట్ అమీర్ తెలిపారు. ఈ నెల 14 నుంచి నాలుగు రోజుల పాటు రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన జరాఫతీమా, మనీషా అనే విద్యార్థినిలు కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొనున్నారు.


బాలికల పాఠశాల విద్యార్థులు

ప్రచార రథం వద్ద రాజన్న దర్శనం


పనులు పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా రాజరాజేశ్వరస్వామి దేవాలయానికి వచ్చిన భక్తులు బుధవారం స్వామివారి దర్శనాలు నిలిపివేయడంతో తూర్పుద్వారం ఎదురుగా ప్రచార రథం వద్ద ఏర్పరిచిన ఎల్ఈడీ ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులకు ఆలయ ఇవో రమాదేవి పలు సూచనలు చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటుచేశారు. క్యూలైన్ ద్వారా భక్తులు ప్రచార రథం వద్దకు చేరుకొని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయం వద్ద బుధవారం రాత్రి కార్తీక దీపోత్సవం నిర్వహించారు. అనంతరం భీమేశ్వరస్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. సాముహిక దీపాలంకరణకు హాజరైన సుహాసీనులకు వాయినాన్ని ఏఈవో శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, జూనియర్ అసిస్టెంట్ కూరగాయల శ్రీనివాస్, నరాల రాజులు పాల్గొన్నారు.

• పనులు పర్యవేక్షించిన ప్రభుత్వ విప్

రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో కొనసాగుతున్న ఆలయ విస్తరణ పనులను బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పర్యవేక్షించారు. భవనాల కూల్చివేత, శిథిలాల తొలగింపు తదితర పనులను పరిశీలించారు. శిథిలాల తొలగింపు వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రచార రథం వద్ద ఎల్ఈడీలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. ఆర్డీవో రాధాబాయి, ఈవో రమాదేవి, ఏఎస్పీ చంద్రయ్య, ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, అర్‌అండ్‌బీ డీఈ అచ్చయ్య ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రిశ్విత

ఇల్లంతకుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లంపట్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి మామిండ్ల రిశ్విత రాష్ట్రస్థాయి హామర్‌త్రో పోటీలకు ఎంపికయింది. కరీంనగర్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలలో అండర్ 17 విభాగంలో రిశ్విత ఉత్తమ ప్రదర్శన కనబర్చింది. ఈ నెల 15నుంచి హైద్రాబాద్‌లోని జింఖానా స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననుంది. విద్యార్థి ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయుడు దూస రఘుపతి, వ్యాయామ ఉపాధ్యాయుడు సాబీర్‌లతో పాటు గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు

మల్యాల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కోతుల దాడిలో మల్యాల మండల కేంద్రంకు చెందిన రాచర్ల చిన్నమ్మ అనే వృద్ధురాలి కాలుకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స కోసం మల్యాల ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి తీసుకెళ్లగా గాయాలు తీవ్రంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే మండలంలో ఇటీవల కోతుల బెడద అధికమవగా జనాలపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయని పూర్తి స్థాయిలో వైద్యంకు సంబంధించి వ్యాక్సిన్ ఇతరాత్రా ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అందుబాటులో ఉంచాలని మాజీ ఎంపీటీసీ రమేశ్ వైద్యాధికారులను కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

కరీంనగర్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ త్రీటౌన్ పరిధిలో పోగొట్టుకున్న 20 సెల్‌ఫోన్‌లను బుధవారం టౌన్ ఏసీపీ వెంకటస్వామి యజమానులకు అప్పగించారు. ఆయా సందర్భాల్లో బాధితులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఐ జాన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఫోన్‌లను రికవరీ చేసిన సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత


రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ చందన

చందుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులు పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ మర్రిపల్లి చందన అన్నారు. చందుర్తి మండలం మరిగడ్డ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, సనుగుల గ్రామంలోని గంగిరెద్దుల కాలనీని సందర్శించారు. బాలల హక్కులపై అవగాహన కల్పించారు. బాలల హక్కుల పరిరక్షణలో అధికారులంతా భాగస్వాములు కావాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరు అంకితభావంతో పని చేయాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని, ఆడపిల్లకు 18 ఏళ్లు, మగ పిల్లాడికి 21 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లిళ్లు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చేయడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో పాటు గృహహింస పెరిగే అవకాశాలు ఉంటాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే 14 ఏళ్లలోపు చిన్నారులను పాఠశాలలకు పంపించాలని చెప్పారు. మధ్యలో చదువు మానిన విద్యార్థులను గుర్తిస్తే వెంటనే పాఠశాలలో చేర్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వినోద్, ఐసిడిఎస్ సిడిపిఓ సుచరిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, డిస్టిక్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కవిత, డిసిపిఓ అంజి పాల్గొన్నారు.

గణితంలో రేపాక విద్యార్థిని ఉత్తమ ప్రతిభ


వర్షిణి

ఇల్లంతకుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేపాక గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని బొడ్డు వర్షిణి గణితంలో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. సదిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథమటిక్స్ టాలెంట్ పోటీలలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన విద్యార్థులు పాల్గొన్న పోటీలలో తృతీయస్థానంలో నిలిచింది. ఉన్నత విద్యకోసం కార్పోరేట్ కళాశాలలు హస్టల్‌తో పాటు ఉచితంగా విద్యను అందించడానికి ముందుకు వచ్చినట్లు విద్యార్థిని తండ్రి రాజు తెలిపారు. ఈసందర్భంగా వర్షిణీకి మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్, ప్రధానోపాధ్యాయురాలు రేవతి, గణిత ఉపాధ్యాయుడు మల్లికార్జున్, పాఠశాల కమిటీ చైర్మన్ లీలలతో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఇల్లందకుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు. మండలంలోని చిన్నకోమటిపల్లి శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించినట్లు, వారి వద్ద రూ.18,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

రైతులపై అదనపు ఆర్థికభారం

(5వ పేజీ తరువాయి)

చేస్తున్నారు. వీటితో తడిసిన పొలాల్లో యంత్రాలు నెమ్మదిగా పని చేయడంతో సమయం, ఖర్చు రెండూ పెరుగుతున్నా యని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అకాల వర్షంతో నష్టం

చిట్యాల భూమారెడ్డి, రైతు, తిమ్మాపూర్



ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు వరి పంటలు పూర్తిగా నేలవాలాయి. పొట్ట దశ నుంచి వర్షాలు అధికంగా పడడంతో పంటలకు నష్టం జరిగింది. వరి పైరు వెన్ను విరిగి నేల వాలడంతో కోయడం కష్టంగా మారింది. యంత్రాలతో కోయించినా దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. యంత్రాల చార్జీలు పెరిగాయి.

మిషన్లకు పైసలు పోతున్నాయి

జెట్టి అంజయ్య, రైతు, బట్టపల్లి



జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు వరి పంట పలు ప్రాంతాల్లో నేల వాలింది. ఐదు ఎకరాలు చైన్ మిషన్‌తో కోయిస్తున్నారు. గంటకు రూ.3,500 నుంచి రూ.3,800 వరకు తీసుకుంటున్నారు. మార్పిడి చేసిన ధాన్యం తీసుకురావడం కూడా కష్టంగా మారింది. వర్షాలకు పొలాలు చిత్తడిగా ఉండడంతో పెట్టుబడి మరింత పెరిగింది.

జోనల్ స్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

రాయికల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు కరీంనగర్ జోనల్ స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. అండర్-17 బ్యాడ్మింటన్ పోటీల్లో పాఠశాలకు చెందిన ఎండీ రయాన్, ఆర్.శివమణిలు ప్రతిభ కనబరిచి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ తిరుపతి రావు, ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

బీసీ ఆక్రోశ మహాసభను విజయవంతం చేయండి

జగిత్యాల టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఈనెల 15న కామరెడ్డిలో నిర్వహించే బీసీ ఆక్రోశ మహాసభను విజయవంతం చేయాలని జగిత్యాల జిల్లా జేఏసీ అధ్యక్షుడు మానాల కిషన్ పిలుపునిచ్చారు. జగిత్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మానాల కిషన్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కామరెడ్డి పట్టణంలోని సత్యం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఈ సభలో బిసి, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల శ్రీనివాస్, కార్యదర్శి నల్లూరి రాజాగౌడ్, జగిత్యాల పట్టణ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీకాంత్ గౌడ్, నాగుల కిషన్ గౌడ్, చెట్టె రాజేశ్వర్, చిగుళ్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి

-సమస్యల పరిష్కారానికి చర్యలు -జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

రాయికల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. రాయికల్ మండలంలో ఒక్కో గ్రామానికి రూ.కోటికి పైగా నిధులు మంజూరు చేశామని ఆయన తెలిపారు. మండలంలోని శ్రీరాంనగర్ గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.10 లక్షలతో, భూపతిపూర్ గ్రామంలో రూ.15 లక్షలతో, ఒడ్డెలింగాపూర్ గ్రామంలో రూ.10 లక్షలతో, కట్కాపూర్ గ్రామంలో రూ.10 లక్షలతో అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. శ్రీరాంనగర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో ముచ్చటించారు. భూపతిపూర్, కట్కాపూర్ గ్రామంలో ప్రజల కోరిక మేరకు బస్సు సౌకర్యానికి, నీటి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ధాన్యం కొనుగోళ్లలో దళారులను ఆశ్రయించ వద్దన్నారు. భూపతిపూర్‌లో మినీ వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన నలువాల రాము ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో సుష్మా, ఏఈ ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్‌లు ఏనుగు మల్లారెడ్డి, రాజలింగం, ముత్యం రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, నాయకులు రవీందర్ రావు, కోల శ్రీనివాస్, గన్నె రాజరెడ్డి, మాజీ ఎంపీపీ సురేందర్ నాయక్, అచ్యుత రావు, ముఖీద్, మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వర్ రావు, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

రాయికల్ పట్టణంలోని గుడేటి రెడ్డి సంఘంలో రాయికల్ పట్టణం, మండలానికి చెందిన 27 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.8 లక్షల 82 వేల విలువ గల చెక్కులను బుధవారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ బుధవారం పంపిణీ చేశారు. అలాగే 37 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా మంజూరైన రూ.37 లక్షల 4 వేల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మనోహర్ గౌడ్, తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీవో చిరంజీవి, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, నాయకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

భూపతిపూర్ గ్రామానికి చెందిన ఏనుగు రెడ్డి తల్లి భూమక్క, ముద్దం వెంకటి కూతురు, మోతె భూమారెడ్డి అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబసభ్యులను బుధవారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పరామర్శించారు. అల్లీపూర్ గ్రామానికి చెందిన గోగికార్ నవీన్ అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఒడ్డెలింగాపూర్‌కు చెందిన పంగ లక్ష్మి అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకుల అరెస్ట్

కోరుట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు కోరుట్ల సీఐ సురేష్ బాబు తెలిపారు. బుధవారం సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కోరుట్ల ఎస్ చిరంజీవితో కలిసి వివరాలను వెల్లడించారు. కోరుట్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తురన్న ప్రక్క సమాచారంతో జిల్లా సీసీఎస్ సీఐ శ్రీనివాస్, కోరుట్ల ఎస్ఐ చిరంజీవి తమ సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు సీఐ తెలిపారు. దాడులలో రైల్వే స్టేషన్ ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులను సోదా చేయ్యగా వారిలో ఒక వ్యక్తి పరారీ కాగా ఇద్దరి వ్యక్తులను అదుపోలోకి తీసుకోని పరిశీలించినట్లు తెలిపారు. వారి వద్ద 210 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించి వారిని కోరుట్ల పోలీస్ స్టేషన్ తరలించినట్లు వివరించారు. వారు కోరుట్ల పట్టణానికి చెందిన ఓ ద్విచక్ర వాహన మెకానిక్ షేక్ అమన్ అలియాస్ ఫైజురాజా, హర్‌పతుపురకు చెందిన డిగ్రీ చదువుతున్న విద్యార్థి ముఖీంగా గుర్తించినట్లు సిఐ పేర్కొన్నారు.

రెవెన్యూ అధికారుల ముందు గంజాయి సీజ్ చేసి వారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సీసీఎస్ సీఐ శ్రీనివాస్, కోరుట్ల ఎస్ఐ చిరంజీవితో పాటు వారి సిబ్బందిని సీఐ సురేష్ బాబు అభినందించారు.

'బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం'



రాజనగర్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

రాయికల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లాల బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ గంగాధర్ అన్నారు. మండలంలోని ఇటిక్యాల ఉన్నత పాఠశాలలో బుధవారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గ్రామ పంచాయతీ ఆవరణలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు సీమలదారి సదాశివ్ అధ్యక్షతన బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే ప్రభుత్వ పథకాలైన చైల్డ్ హెల్ప్ లైన్, డయల్ 100 గురించి వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో బాల్య వివాహాల అవగాహన సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని అంటించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్, అనుపురం లింబాద్రి గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాజనగర్ గ్రామ పంచాయతీ పరిధిలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సఖి కేంద్రం ఉద్యోగి శారద గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యదర్శి వెంకటాచలం, ఉపాధ్యాయులు కిరణ్ కుమార్, సత్యనారాయణ, పాఠశాల చైర్మన్ మానస, సూపర్‌వైజర్ రాధ పాల్గొన్నారు. కైరిగూడెం పాఠశాల, అల్లీపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది మానస, కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

మండలంలోని కిష్టంపేట అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వేణుగోపాల్, అంగన్‌వాడీ టీచర్లు యూసుఫా బేగం, అన్నపూర్ణ, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఆరుట్ల రజిత, పి.భూమేష్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

ధర్మపురి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో సాయిని కళావతి, రామయ్యపల్లె గ్రామంలో కాశ్ల శంకరమ్మ అనే మహిళలు అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బుధవారం పరామర్శించారు. బూరుగుపల్లె గ్రామానికి చెందిన ఎర్రం రాజ్‌కుమార్ బ్రేన్ స్ట్రోక్‌తో దుబాయ్‌లో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆయన వెంట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మాజీ ఎంపీపీ సౌళ్ల భీమయ్య, సంగి శేఖర్, సయ్యద్ యూనస్, గడ్డం బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

●**పెగడపల్లి:** పెగడపల్లి మండలం దీకొండ బీఆర్ఎస్ గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు సీనియర్ నాయకుడు లైసెట్టి గంగాధర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రి వెంట నంచర్ల సింగిల్‌విండో చైర్మన్ ఎం.వేణుగోపాల్, వైస్ చైర్మన్ నామ సురేందర్ రావు, పార్టీ అధ్యక్షుడు లోక మల్లారెడ్డి ఉన్నారు.

●**గొల్లపల్లి:** మండలంలోని వివిధ గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బుధవారం పరామర్శించారు. మండలంలోని శ్రీరాముల పల్లె గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుమ్మ రామస్వామి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి పరామర్శించి బాధిత కుటుంబ సభ్యులకు స్థానిక పార్టీ నాయకుల ద్వారా రూ. 10వేల ఆర్థిక సాయం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న చెటిపెల్లి లక్ష్మీనారాయణను పరామర్శించి వారి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు శంకరయ్య, సత్తయ్య, బాబు, కిషన్, రాజశేఖర్, లక్ష్మీగంగారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ హన్మాండ్లు, పార్టీ మండల శాఖ అధ్యక్షులు జలేందర్, యూత్ అధ్యక్షులు రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థి వైద్య ఖర్చులను ప్రభుత్వం భరిస్తుంది

-మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుతో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి బొల్లె హిమేష్‌చంద్ర వైద్య ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఈమేరకు వైద్య ఖర్చులకు ఎస్‌డీడీ నుంచి చెల్లించాలని కలెక్టర్ సత్యప్రసాద్‌ను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్ ఎస్సీ బాలుర వసతి గృహంపై పిడుగుపడి సెప్టెంబరులో బొల్లె హిమేష్‌చంద్ర అనే బాలుడు తీవ్ర గాయపడ్డాడు. మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హాస్పిటల్‌కు వెళ్లి బాలుడి ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులను అడిగి తెలుసుకొని ఖర్చులను ప్రభుత్వం అందిస్తుందని, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వైద్యఖర్చులను సంక్షేమ శాఖ నిధుల నుంచి చెల్లించాలని కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఫోన్‌చేసి ఆదేశించారు. మొత్తం వైద్య ఖర్చును సంక్షేమశాఖ (ఎస్సీడీడీ) నిధుల నుంచి చెక్కురూపంలో అందించారు. ఎస్సీడీడీ కమిషనర్ క్షితిజ యశోద ఆసుపత్రి బిల్లు రూ.18లక్షలు చెక్కు రూపంలో చెల్లించారు. హిమేష్‌చంద్ర స్వగ్రామం మల్యాల మండలం మద్దుట్ల గ్రామం కాగా చెక్కు అందించినందుకు విద్యార్థి తల్లిదండ్రులు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగుల కార్యవర్గానికి సన్మానం

జగిత్యాల టౌన్, నవంబరు 12(ఆంధ్రజోతి): నూతనంగా ఎన్నికైన జగిత్యాల జిల్లా, అర్బన్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గాన్ని జగిత్యాల పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో బుధవారం భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఏసిఎస్ రాజు సన్మానించారు. నూతనంగా ఎన్నికైన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కర్బుజా రవిందర్, ప్రధాన కార్యదర్శి కొలిచెర్ల రవిందర్‌తో పాటు అర్బన్ యూనిట్ అధ్యక్షుడు మెట్ట మల్లికార్జున్, కార్యదర్శి కంటే అంజయ్య కార్యవర్గాన్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిటి కేబుల్ అధినేత టీవీ సూర్యం, తపస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య, సమరసతా వేదిక అధ్యక్షుడు చిట్ల గంగాధర్, బిసి సంక్షేమ సంఘం జిల్లా మహిళ అధ్యక్షురాలు అరవ లక్ష్మి, భారత్ సురక్ష సమితి కార్యదర్శి సింగం గంగాధర్, వేముల పోచమల్లు, బండారు మల్లికార్జున్, కొత్తకొండ బాలయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు టీషర్టుల అందజేత

గొల్లపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం గోవిందు పల్లె ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా విధులు నిర్వహిస్తూ ఇటీవల పదోన్నతి పొంది బదిలీ పై వెళ్తున్న రఘుపతి అనే ఉపాధ్యాయుడు పాఠశాలలోని అందరూ విద్యార్థులకు స్పోర్ట్స్ టీ షర్ట్‌లు పంపిణీ చేసి బుధవారం ఔదార్యం చాటుకున్నారు. ఈ సందర్భంగా రఘుపతికి వీడ్కోలు సమావేశంను ఘనంగా నిర్వహించారు. బదిలీ పై వెళ్తున్న ఉపాధ్యాయుడిని శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన విధి నిర్వహణలో చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యుగంధర్, స్వప్న, సుప్రజ, సుజాత, పాఠశాల కమిటీ చైర్మన్ స్వప్న, కార్యదర్శి సంజీవ్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

కోరుట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనులను వేగవంతగా పూర్తి చేయఆలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అధికారులను సూచించారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్‌లోని వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన నిదులతో చేస్తున్న అభివృద్ధి పనుల వివరాలను కోరుట్ల ఎమ్మెల్యే డాకర్ సంజయ్ అడిగి తెలుసుకున్నారు. పట్టణాలలో పూర్తి స్థాయిలో చెడి పోయిన రోడ్లు, మురికి కాల్వను గుర్తించి మరమత్తులు చేయాలని అన్నారు. నూతనంగా నిర్మాణం చేస్తున్న మురికి కాల్వలు, సీసీ రోడ్లు నాణ్యతతో నిర్మించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్లు రవీంధర్, మోహన్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

కోరుట్ల/కోరుట్ల రూరల్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు వివిధ రకాల చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పంపిణీ చేశారు. కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 143 మంది లబ్ధిదారులకు రూ. 1,43,16,588 విలువ గల చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. 13 మంది లబ్ధిదారులకు 2,98,000 విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, నాయకులు మోహన్ రెడ్డి, అన్వర్, సందయ్య, ప్రభులతో పాటు పలువురు పాల్గొన్నారు.

శబరిమలకు ఆర్టీసీ బస్సులు

కోరుట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప మాల దారులు శబరిమల యాత్ర కొరకు కోరుట్ల ఆర్‌టీసీ డిపో నుండి బస్సు సౌకర్యాలను కల్పిస్తున్నాట్లు డిపో మేనేజర్ మనోహర్ బుధవారం తెలిపారు. కోరుట్ల పట్టణానికి చెందిన గట్ల ఆనంద్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శబరి యాత్ర కొరకు బస్సును వారి బృందం బుకు చేసుకోగా వారికి ఆర్‌టీసీ అధిస్తున్న సౌకర్యాలను వివరించారు. అదే విధంగా కోరుట్ల డిపో నుండి శబరి మల యాత్రకు ఇప్పడికే రెండు బస్సులు బుక్ అయినాయని అవసరం ఉన్న స్వాముల బృందాలు తమ దృష్టికి తీసుకవస్తే మరిన్ని బస్సు సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దీక్ష భూనే భక్తులు బచ్చు శ్రీనివాస్, అల్లె గణేష్, బోమ్మ రాజేశం, మణిదీప్, ఆర్‌టీసీ డిపో సూపరింటెండెంట్ గంగారాం, డిప్యూటి సూపరిండెంట్ ఫైనాన్స్ బాబు, బస్సుల ఇంచార్జు రమేష్, మెకానిక్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గొల్లపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మొక్కజోన్న కొనుగోలు కేంద్రంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి రైతులకు సూచించారు. బుధవారం గొల్లపల్లి మండలం శ్రీరాముల పల్లె గ్రామంలో మొక్కజోన్న కొనుగోలు కేంద్రంను గొల్లపల్లి సింగిల్‌విండో ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రంను ప్రారంబించి మాట్లాడారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ రైతులు దళారులనాశ్రయించి మోస పోవద్దని, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో తమ పంటను విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు. విక్రయానికి వచ్చే రైతులకు కేంద్రంలో కనీస వసతులు కల్పించాలని, ఏలాంటి ఇబ్బందులు కల్గకుండా చూడాలని నిర్వహకులను ఆదేశించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రంను శ్రీరాములపల్లె గ్రామంలో ఏర్పాటుకు కృషి చేసిన రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు మక్కరైతుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు లంబ లక్ష్మణ్, నల్ల రాంరెడ్డి, గడ్డం తిరుపతి రెడ్డి, పొన్నం రఘుపతి, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి

జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 17 బాయ్స్ అండ్ గర్ల్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు పట్టణంలోని స్థానిక వివేకానంద ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు ఉమ్మడి జిల్లా స్థాయిలో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ చక్రధర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు గంగాధర్, కొమురయ్య, జమునారాణి, విజయ, కిషోర్, రాము, అరుణ్, రాజచందర్ తో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

పెగడపల్లి ఎస్ఐ కిరణ్‌కుమార్



పెగడపల్లిలో బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ కిరణ్ కుమార్

పెగడపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కేడీసీసీబీ బ్యాంక్ వద్ద గల మూలమలుపులో వాహనాల వేగ నియంత్రణకు గాను బుధవారం రోజు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నాలుగు బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు గాను బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు, బారికేడ్లతో వాహన వేగం తగ్గి ప్రమాదాలు నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది చంద్రశేఖర్, శ్యాం తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందిస్తున్నాం

అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలలో చదివే విద్యార్థులకు విద్యతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభానైపుణ్యం గల విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు అవసరమైన ప్రోత్సాహకాలను అందిస్తున్నామని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేంధర్‌రెడ్డి అన్నారు. జగిత్యాల పట్టణంలోని స్థానిక శివవీధి అల్ఫోర్స్ ఇటెక్నో స్కూల్‌కు చెందిన విద్యార్థులు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరేంధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని, విద్యతో పాటు క్రీడలు ప్రధానం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు క్రీడా విద్యార్థులున్నారు.

'ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లింపు'

సారంగాపూర్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండలం అర్పపల్లి గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.50 లక్షలు దారి మళ్లించారని మాజీ సర్పంచ్ కొండ శ్రీలత ప్రభాకర్ ఆరోపించారు. అర్పపల్లి గ్రామంలో ఎస్సీ మాల, మాదిగ కాలనీలకు సీసీ రోడ్డు నిర్మాణ పనుల కోసం ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.50లక్షలు మంజూరయ్యాయన్నారు. సదరు కాంట్రాక్టర్ ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పనులు పూర్తి చేయకుండానే ఓసీ, బీసీ కాలనీల్లో ఈ ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో సీసీ రోడ్లు వేశాడని ఆరోపించారు. రోడ్డు నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని, పర్యవేక్షించాల్సిన సంబంధిత ఏఈ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాడని మాజీ సర్పంచ్ ఆరోపించారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ధాన్యంలో కోత విధిస్తున్నారని ఫిర్యాదు

సారంగాపూర్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు నాయకపుగూడెం, ఇతర కేంద్రాల నుంచి తూకం వేసి మిల్లులకు పంపిన ధాన్యం నాణ్యత లేదంటు మిల్లర్లు లారీకి 3 నుంచి 5 క్వింటాళ్ల కోత విధిస్తున్నారని జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్‌కు రైతులు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఆయన సివిల్ సప్లయిస్ అధికారులతో, సహకార సిబ్బందితో మాట్లాడారు. ధాన్యంలో కోతలు జరగకుండా చూస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

పరిశోధనా క్షేత్రాన్ని సందర్శించిన విద్యార్థులు

భీమారం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు బుధవారం పొలాసలో గల ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధనా క్షేత్రాన్ని సందర్శించారు. విద్యార్థులకు వాతావరణ అంశాలు, గాలిలో తేమ వా తం, గాలి దిశ, గాలి వేగం, మట్టిలో నీటి శాతం, మట్టి ఉష్ణోగ్రత, ఆటోమేటిక్ వెదర్ రిపోర్ట్, వర్మీ కంపోస్టు తయారీ విధానం, వ్యవసాయంలో ఉపయోగించే వివిధ రకాల పనిముట్లు, యంత్రాలు, మట్టిలో ఉండే పోషకాలు, నూతన వంగ డాలను తయారు చేసేందుకు శాస్త్రవేత్తల కృషిని వివరించారు. ప్రధానోపా ధ్యాయుడు రవీందర్‌రెడ్డి, శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

25 నుంచి మల్లికార్జున స్వామి జాతర

గొల్లపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లన్న పేట శ్రీ మల్లిఖార్జున స్వామి జాతర ఉత్సవాలు ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 25న స్వామి వారి కళ్యాణ మహోత్సవంతో ప్రారంభ మయ్యే జాతర ఉత్సవాలు డిసెంబరు 18న మహాన్యాసపూర్వక రుద్రాభిషే కంతో ఘనంగా ముగుస్తాయి. సుమారు నెల రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగే జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఈ నెల 25న స్వామివారి కళ్యాణ మహోత్సవం, 26న దండివారం, 28న నాగవెళ్లి కార్యక్రమాలను ఆలయ పూజారుల వేధమంత్రోచ్ఛరణల నడుమ అంగరంగవైభంగా నిర్వహిస్తారు. అనంతరం ప్రతి ఆది. బుధవారాల్లో జాతర ఉత్సవాలు జరుగుతాయి. జాతర ఉత్సవాలకు వచ్చే భక్తులకు కావాల్సిన మౌళిక వసతుల ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. జాతర ఉత్సవాలకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆలయ పౌండరి ట్రస్ట్ కొండూరి శాంతయ్య, ఈవో విక్రమ్ కోరారు.

యామాపూర్-నడికుడ రహదారిని పరిశీలన

ఇబ్రహీంపట్నం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి యామాపూర్, పీకర్, కొండాపూర్ మీదుగా మల్లాపూర్ మండలం నడికుడ గ్రామం వరకు నిర్మాణం చేయాల్సిన రహదారిని బుధవారం తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో గణేష్ తదితర అధికారులు పరిశీలించారు. ఈ రహదారికి గతంలో నిధులు మంజూరైనా పనులు చేపట్టకపోవడంతో మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన దిశ కార్యక్రమంలో పాల్గొన్న నిజామా బాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఈ రోడ్డు నిర్మాణ విషయాన్ని ప్రస్తావించారు. ఈ మేరకు అధికారులు రహదారిని పరిశీలించారు.

మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి నివాళి

మెట్‌పల్లి టౌన్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే తుమ్మల వెంకటరమణారెడ్డి 18వ వర్ధంతిని స్థానిక బీజేపీ నాయకులు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, బోడ్ల రమేష్‌లు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దామన్న చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొల్లెపు శ్రీనివాస్, తోకల సత్యనారాయణ, ఇల్లెందుల శ్రీనివాస్, పార్లమెంట్ కో కన్వీనర్ గుంటుక సదాశివ, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి సుంకేటి విజయ్, ఉపాధ్యక్షులు అనిల్ గౌడ్, నగేష్, గౌతం, లక్ష్మన్, నర్సయ్య, గణేష్, ఎర్రోళ్ల అంజయ్య, గణేష్ బాబు, సుతారి భూమారెడ్డి, శ్రీనివాస్ చారి పాల్గొన్నారు.

కామ్రెడ్ ప్రభాకర్‌కు ఘన నివాళి

కోరుట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బీడి కార్మికుల సమస్యలపై నిరంతం పోరాటం చేసిన కామ్రెడ్ సి. ప్రభాకర్‌కు సిపిఐ నాయకులు ఘన నివాళిని అర్పించారు. మంగళవారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో ప్రభాకర్ జయంతి వేడుకలను నిర్వహించారు. సి. ప్రభాకర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లను అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చెన్న విశ్వనాథం, సుతారి రాములు, ముక్రం, సి. ప్రభాకర్ గంధ్రాలయ కమిటీ సభ్యులు భూమయ్య, దేవయ్య, భూమయ్య పాల్గొన్నారు.